మహిమాన్వితుడు..
బొప్పేపల్లి కాశీం స్వామి

- 7వ తేదీ నుంచి మొహర్రం
- గూగూడు తర్వాత ఘనంగా జరిగేది ఇక్కడే..
- పది రోజుల పాటు నిర్వహణ
- భారీగా తరలిరానున్న భక్తులు



బత్తలపల్లిలో వివిధ గ్రామాలకు చెందిన పీర్లతో భేటీ అవుతున్న పీర్లు, తరలివచ్చిన ప్రజలు (ఫైల్)

బత్తలపల్లి: ఉమ్మడి అనంతపురం జిల్లాలో గూగూడు తర్వాత బత్తలపల్లిలోని బొప్పేపల్లి కాశీం స్వామి (మొహర్రం) ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. వివిధ ప్రాంతాలు, జిల్లాల నుంచి కాశీం స్వామి దర్శనానికి భక్తులు భారీగా తరలివస్తారు. కాశీం స్వామి కోర్కెలు తీర్చే మహిమాన్వితుడిగా భక్తులు చెప్పుకుంటారు. ఈనెల 7వ తేదీ నుంచి బొప్పేపల్లి కాశీం స్వామి (మొహర్రం) ఉత్సవాలు జరగనున్నాయి. ఇందు కోసం ఇప్పటికే గ్రామస్తులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ వేడుకలు పది రోజులు పాటు వైభవంగా జరుగుతాయి. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో ఈ వేడుకలను నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు. మొహర్రంను ప్రశాంతంగా జరుపుకోవాలని తహసీల్దార్ శివశంకర్ నాయక్, ఎస్ఐ శ్రీనివాసులు గ్రామ పెద్దలకు సూచించారు.

పది రోజుల ఉత్సవాలు ఇలా..

రెండవ గూగూడుగా అభివర్ధించే బత్తలపల్లిలోని బొప్పేపల్లి కాశీం స్వామి (మొహర్రం) ఉత్సవాలు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. పది రోజుల పాటు జరిగే వివిధ కార్యక్రమాల్లో భాగంగా 7వ తేదీ గుద్దిలి వేసి వేడుకలకు అంకురార్పణ చేస్తారు. 8వ తేదీ రాత్రికి పీర్లను అలంకరించి వేదికపై కొలువుదీరుస్తారు. ఆ రోజు నుంచి 11వ తేదీ వరకు నిత్యపూజ నివేదన ఉంటుంది. 12వ తేదీ ఐదవ సరిగెత్తు, అదే రోజు ముస్లింలు పక్కీర్లు అవుతారు. 13వ తేదీ నిత్యపూజ నివేదన, 14వ తేదీ చిన్నసరిగెత్తు (పానకాలు) నిర్వహిస్తారు. అదే రోజు రాత్రికి హిందువులు, పక్కీరుబాబాలుగా దీక్షలు చేపడతారు. 15వ తేదీ ఉదయం గ్రామోత్సవం అనంతరం పీర్లు గంటాపురం, వేల్పుమడుగు, పోట్లమర్రి గ్రామాలకు వెళ్లి ఆ గ్రామాల్లోని పీర్ల చావిడి వద్ద పీర్లు పూజలందుకుంటాయి. ఈ విధంగా పీర్లు అన్ని గ్రామాలను సందర్శించి అక్కడి పీర్లను జలధి రోజు భేటీలకు రమ్మని ఆహ్వానించినట్లుగా అందరూ భావిస్తారు. 16వ తేదీ పెద్ద సరిగెత్తు (పెద్ద పానకాలు) అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. ఆ రోజు పీర్లను వివిధ రకాలుగా అలంకరించి మొక్కులు చెల్లిస్తారు. అదే రాత్రంతా అగ్నిగుండం పెద్ద ఎత్తున వెగిలించి అలావ్ (కదం) తొక్కుతారు. ఈ దృశ్యం చూడముచ్చటగా ఉంటుంది. 17వ తేదీ ఉదయం పీర్లు గ్రామోత్సవంలో భాగంగా బత్తలపల్లి కూడలికి వస్తాయి. అదే సమయంలో పరిసర గ్రామాల పీర్లు కూడా కూడలికి వచ్చి (భేటీలో) ఆలింగనంతో శుభాకాంక్షలు తెలుపుకుంటాయి. ఈ సమయం కోసం వేచి ఉండే భక్తులు బెల్లం, పూలు, కొబ్బరి, పండ్లు స్వామి పైకి జయజయ ధ్వనులతో విసురుతారు. ఈ భేటీలో అన్ని గ్రామాలు స్నేహపూర్వకంగా ఉండటానికి సంకేతమని ప్రజలు భావిస్తారు. ఈ భేటీల అనంతరం అదే రోజు సాయంత్రం పీర్లు అగ్నిగుండ ప్రవేశం చేసి జలధికి తరలివెళ్తాయి. ఉత్సవాలకు చివరి రోజైన రెండు రోజుల అనంతరం అనగా 19న జార్తల్ (దినాలు) చేస్తారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ముజావర్లు గుండం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి వేడుకలను ప్రారంభించనున్నారు. మొహర్రం ఉత్సవాలపై ధర్మవరం డీఎస్పీ టి.శ్రీనివాసులు, ధర్మవరం రూరల్ సీఐ ఆరోహణ రావు, బత్తలపల్లి ఎస్ఐ శ్రీనివాసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని మండల ప్రజలకు సూచించారు.



బత్తలపల్లిలో ఊరేగుతున్న కాశీంస్వామి (ఫైల్)

క్లుప్తంగా

450 బొప్పాయి చెట్ల నరికివేత



బొప్పాయి చెట్లను నరికేసిన దృశ్యం

బత్తలపల్లి: మండలంలోని యర్రాయపల్లికి చెందిన పోలినేని వెంకటరాముడుకు చెందిన 450 బొప్పాయి చెట్లను శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. పోలినేని వెంకటరాముడు అనంతపురం రూరల్ మండలం మన్నీల గ్రామంలో తన కున్న 4.70 ఎకరాల పొలంలో ఆరు నెలల క్రితం రూ.7 లక్షల పెట్టుబడితో ఐదువేల బొప్పాయి చెట్లు సాగు చేశారు. మరో నెలలో దిగుబడి రానుంది. అయితే శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వాటిని నరికేశారు. బాధితుడు ఆదివారం ఇటుకలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బత్తలపల్లి, ఇటుకలపల్లి ఎస్ఐలు శ్రీనివాసులు, రాఘవేంద్రరెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటశివారెడ్డి పోలీస్ జాగిలాలతో దర్యాప్తు చేపట్టారు.

ఏటి గంగమ్మకు ప్రత్యేక పూజలు



ఏటి గంగమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

తలుపుల: స్థానిక ఎగువపేట సమీపంలో ఉన్న ఏటి గంగమ్మకు ఆదివారం బోనాలు ఊరేగించారు. కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏటా మొలకల పౌర్ణమి తిరునాల తరువాత 40 రోజులకు మారు పల్లెం వేయడం ఆనవాయితీగా వస్తోంది, ఈ ఆనవాయితీ ప్రకారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో టి.రెడ్డివారిపల్లి, ఎగువపేట, బలిజపేట, ప్రకాష్ నగర్ వాసులు అమ్మవారి ఆలయాన్ని శుద్ధి చేశారు. అనంతరం ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. బోనాలు వండి పల్లెం వేయడం జరిగింది. అనంతరం భక్తాదులకు పెద్దన్నవారి పల్లికి చెందిన ఉపాధ్యాయుడు గంగిశెట్టి సొంత నిధులతో అన్నదానం చేశారు.

పెద్దకోట్ల చౌడేశ్వరి దేవికి పూజలు



అలంకరణలో చౌడేశ్వరి దేవి

తాడిమర్రి: మండలంలోని పెద్దకోట్ల గ్రామంలో ఉన్న చౌడేశ్వరి దేవి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి అమ్మవారి మూలవిరాట్‌కు బంగారు, వెండి ఆభరణాలు తొడిగి, వివిధ రకాల పుష్పమాలలతో అందంగా అలంకరించారు. అనంతరం కుంకుమార్చన, పుష్పాంజలి తదితర పూజలు చేశారు. పెద్దకోట్ల, గుడ్డంపల్లి గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ పూజారి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

బత్తలపల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శివశంకర్ నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు. అదే విధంగా మండల స్థాయిలో జరిగే ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులందరూ హాజరు కావాలని సూచిం చారు. ప్రజలు కూడా ఏవైనా సమస్యలుంటే వినతిపత్రాలను అందజేయవచ్చని వెల్లడించారు.

చెట్లతోనే మానవ మనుగడ



తాడిమర్రి జెడ్పీహెచ్ఎస్‌లో మొక్కలు నాటుతున్న దృశ్యం

తాడిమర్రి: పచ్చని చెట్లతోనే మానవ మనుగడ సాధ్యమని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ గంగులకుంట గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న తల్లికి వందనం కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, జిల్లా అధ్యక్షుడు గోరంట్ల మోహన్ ఆదేశాలతో మండలంలో మొక్కలు నాటడానికి శ్రీకారం చుట్టామన్నారు. బీజేపీ కార్యకర్తలు అంకిత భావంతో పని చేస్తూ 25,000 మొక్కలను నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఎస్పీ పోతలయ్య, దళిత మోర్చా మండల అధ్యక్షుడు గురప శ్రీరాములు, దేవర రాము, బిల్లే చంద్ర, నిడిగల్లు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు ఘన వీడ్కోలు



ఉదయ్ భాస్కర్‌రెడ్డిని సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు



నల్లచెరువు: ఈఓఆర్డీ ఆనందయ్యను సన్మానిస్తున్న పంచాయతీ కార్యదర్శులు



ధర్మవరం అర్బన్: మాట్లాడుతున్న డీఎం సత్యనారాయణ



తనకల్లు: హెచ్ఎం లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

గాండ్లపెంట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తూ ఉద్యోగ విరమణ చేసిన ప్రధానోపాధ్యాయురాలు మధురాంబ, ఆంగ్ల ఉపాధ్యాయుడు జయరాములు, హిందీ ఉపాధ్యాయుడు హర్షద్ అలీకి సహచర ఉద్యోగులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఆదివారం సహచర ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది వీరిని సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు ఉపాధ్యాయులు మాట్లాడారు. ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్ది బంగారు భవిష్యత్తు కల్పించిన ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. సమావేశం అనంతరం వారిని పూలమాలలు వేసి దుశ్శాలువాతో సన్మానించి జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణానాయక్, సహచర ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఈఓఆర్డీ ఆనందయ్యకు సన్మానం..

తనకల్లు/నల్లచెరువు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పని చేస్తూ ఉగ్యోగ విరమణ చేసిన ఈఓఆర్డీ ఆనందయ్యను ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. ఈఓఆర్డీ ఆనందయ్య క్రమశిక్షణ, విధుల పట్ల నిబద్ధత, సమయ పాలన పాటిస్తూ అందరికీ ఆదర్శంగా నిలిచాయని కొనియాడారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఆనందయ్య చూపిన చొరవ అభినందనీయమన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎంగా పని చేస్తూ రిటైర్డ్ అయిన లక్ష్మీనారాయణను ఎమ్మార్వో కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ లలితమ్మ, ఉపాధ్యాయులు, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. నల్లచెరువు మేజర్ పంచాయితీ సర్పంచ్ పంచరత్నమ్మతో పాటు పంచాయతీ కార్యదర్శులు వసుంధర, రమణప్ప నాయుడు, గంగాధర, గోపినాథ్, నరసింహులు, నరేష్,విజయ్,శబ్బీర్, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది విశ్వేశ్వర్ తదితరులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

ఉద్యోగ విరమణ సహజమే..

ధర్మవరం అర్బన్: ప్రతి ఉద్యోగికి పదవీవిరమణ తప్పనిసరి అని ఉద్యోగంలో ఉన్నంత కాలం అందరితో మంచితనంగా మెలగాలని డిపో మేనేజ్ సత్యనారాయణ తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ఆదివారం ఆర్టీసీ ఉద్యోగులు బయపురెడ్డి, జీబీఎస్ రెడ్డి, ఎస్వీ రమణ, ఏడీసీ అజీజ్‌లు పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎం చేతులమీదుగా వారిని శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ పదవీ విరమణ అనంతరం తమ కుటుంబ సభ్యులతో సంతోషంగా ఆరోగ్యంగా జీవించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ ప్రేమ్‌కుమార్, ఏఈ సికిందర్, టీఐ శ్రీరాములు, పుట్టపర్తి డిపో టీఐ పెద్దన్న, ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు కెబీ నాగార్జునరెడ్డి, నేషనల్ మజ్దూర్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బి.ముత్యాలప్ప, ఏడీసీలు మేడాపురం నరసింహులు, సాహెబ్, ఎంప్లాయిస్ యూనియన్ రీజన్ నాయకులు బి.నరసింహులు, లక్ష్మి, డిపో కార్యదర్శి ముస్తఫ, రిటైర్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్: స్థానిక ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన గంగిరెడ్డిని ఆదివారం ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. గంగిరెడ్డి అంకిత భావంతో విధి నిర్వహణ చేశారని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో క్రిష్టయ్య, జీసీఎస్ నాయుడు,ఆర్ఎస్‌రెడ్డి, దివాకర్,శంకరప్ప, హరికుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని జామియా మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షాహీదా బాను ఉద్యోగ విరమణ సందర్భంగా ఉద్యోగులు దుశ్శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి తాహిర్‌వలి, ప్రధానోపాధ్యాయురాలు సిరాజున్నీసా, ఆజంబాషా పాల్గొన్నారు.

ఉదయ్ భాస్కర్‌రెడ్డి సేవలు అమూల్యం

పుట్టపర్తి: అంకిత భావంతో పని చేసి ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన వ్యక్తి ఉదయ్ భాస్కర్‌రెడ్డి అని పలువురు వక్తలు కొనియాడారు. కొత్తచెరువు మండలం మీర్జాపురం ప్రాథమిక పాఠశాలలో పని చేస్తూ ఉగ్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయుడు ఉదయ్ భాస్కర్‌రెడ్డి దంపతులను పాఠశాల సిబ్బంది, బంధువులు, ఉపాధ్యాయులు ఆదివారం ఘనంగా సన్మానించారు. తలమర్ల పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏడీ లాజర్ ఎంఈఓ జయచంద్ర, వైఎస్సార్‌టీఎఫ్, పీఆర్‌టీయూ, ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నేతలు రమణారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రజనీకాంత్‌రెడ్డి, మాధవ్, చెన్నకృష్ణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఎంపీపీ భర్త సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకుడు రెడ్డెప్పరెడ్డి, మాజీ సర్పంచ్ శ్యామ్ సుందర్‌రెడ్డి, మటన్ శంకర్, పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శానిటరీ ఉద్యోగుల సేవలు మరువలేనివి

ధర్మవరం అర్బన్: పట్టణ పరిశుభ్రతలో శానిటరీ ఉద్యోగుల సేవలు మరువలేనివని మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్ తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఉద్యోగ విరమణ పొందిన శానిటరీ మేస్త్రి నాగరాజు, కార్మికుడు సుబ్బరాయుడును మున్సిపల్ అధికారులు శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి, మేనేజర్ ఆనంద్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్యామ్సన్, కేశవ, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టపర్తి టౌన్: స్థానిక ఆర్టీసీ డిపోలో కండక్టర్లుగా విధులు నిర్వహిస్తున్న చెన్నప్ప, సుబ్రహ్మణ్యం, లక్ష్మీనారాయణ ఉద్యోగ విరమణ చేశారు. ఆదివారం ఆర్టీసీ డిపోలో ఉద్యోగ, కార్మిక సిబ్బంది ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కండక్టర్లను శాలువాలు, పూలమాలలతో సత్కరించి వీడ్కోలు పలికారు.



గాండ్లపెంట: ఉద్యోగ విరమణ చేసిన హెచ్ఎం, ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం



కదిరి అర్బన్: కండక్టర్ గంగిరెడ్డి దంపతులకు సన్మానం



కదిరి అర్బన్: ఉద్యోగ విరమణ చేసిన షాహీదాబానుతో తోటి ఉపాధ్యాయులు

అన్నదానం



రోగులకు అన్నదానం చేస్తున్న దాత పామిశెట్టి నవశంకర్

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు, వారి సహాయకులకు దాత పామిశెట్టి నవశంకర్ ఆదివారం అన్నదానం చేశారు. చీరల వ్యాపారం చేస్తూ జీవిస్తున్నానని తనకు వచ్చిన డబ్బులో కొంత పేదలకు సాయం చేయాలని అన్నదానం చేస్తున్నామని పేర్కొన్నారు.

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని గొట్లూరు అనాథాశ్రమంలోని వృద్ధులు, అనాథలకు ఆదివారం ఆర్యవైశ్య సంఘం సభ్యులు కందికుంట జయరాములు, వెంగమ్మ దంపతుల జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాట మారెమ్మకు పూజలు



అలంకరణలో బాట మారెమ్మ

కనగానపల్లి: మండల కేంద్రమైన కనగానపల్లి సమీపంలోని ప్రధాన రహదారి పక్కన వెలసిన బాట మారెమ్మకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి అమ్మవారిని ఆభరణాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

బాలిక అదృశ్యం

నల్లచెరువు: మండల కేంద్రానికి చెందిన ఓ బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ లింగన్న తెలిపిన వివరాలు.. బాలిక ఈనెల 29వ తేదీ శనివారం రాత్రి 8:30 గంటల సమయంలో సమీపంలోని అమ్మమ్మ ఇంటికి వెళ్తున్నట్లు తల్లికి చెప్పి వెళ్లింది. అయితే ఎంత సేపటికీ తిరిగి రాలేదు. అనుమానం వచ్చిన తల్లి వాళ్ల బంధువుల ఇంటి వద్దకు వెళ్లి చూడగా అక్కడికి రాలేదని చెప్పారు. బాలిక తల్లి పలుచోట్ల గాలించినా ఫలితం లేకపోవడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

టీమిండియాకు అభినందనలు



ఇండియా క్రికెట్ జట్టుకు సెల్యూట్ చేస్తున్న నృత్య కళాకారులు

ధర్మవరం అర్బన్: ఐసీసీ టీ–20 వరల్డ్ కప్ ఫైనల్స్‌లో గెలుపొందిన టీమిండియాకు నృత్య కళాకారులు సెల్యూట్‌తో అభినందనలు తెలిపారు. ఆదివారం పట్టణంలోని శ్రీ లలిత నాట్య కళానికేతన్‌లో నాట్యాచార్యులు బాబు బాలాజీ, కమలా బాలాజీ, రామలాలిత్యలు ఆధ్వర్యంలో కళాకారులు నృత్యం చేశారు. సెల్యూట్ చేసి టీం ఇండియా క్రీడాకారుల ప్రతిభను కొనియాడారు. పిల్లలకు కేవలం నాట్యం మాత్రమే కాకుండా దేశ భక్తిని పెంపొందించడానికి ఈ కార్యక్రమం చేపట్టినట్లు వారు తెలిపారు. ఇండియా ఈ ఘన విజయం సాధించినందుకు ప్రతి భారతీయుడు గర్వపడుతున్నాడని పేర్కొనారు. అనంతరం దేశభక్తి పాటలకు నాట్యం చేస్తూ భక్తిని చాటుకున్నారు.

ఘనంగా చర్చి వార్షికోత్సవం



కేక్ కట్ చేస్తున్న చర్చి పాస్టర్ సుందర్ సింగ్

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీనగర్‌లో ఉన్న బేతేలు బాప్టిస్ట్ చర్చి ప్రారంభించి 24 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం చర్చి పాస్టర్ ఎంఎన్ సుందర్‌సింగ్ ఆధ్వర్యంలో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకలకు సీనియర్ పాస్టర్ నెహెమ్యా, బాప్టిస్ట్ ఫెలోషిప్ ఆఫ్ ఇండియా జిల్లా కో–ఆర్డినేటర్ స్టీఫెన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టిన అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

3న అంబేడ్కర్ జయంత్యుత్సవాలు

చెన్నేకొత్తపల్లి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 133వ జయంత్యుత్సవాలను చెన్నేకొత్తపల్లిలో 3వ తేదీన నిర్వహించనున్నట్లు అందరివాడు ఉత్సవ సొసైటీ సభ్యులు తెలిపారు. ఆదివారం చెన్నేకొత్తపల్లిలో 44వ నంబరు జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన 10 అడుగుల కాంస్య విగ్రహం వద్ద కమిటీ సభ్యులు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరివాడు ఉత్సవ సొసైటీ ఆధ్వర్యంలో ఎన్.ఆంజనేయులు, ఎస్.ఎన్ వేణుగోపాల్, నాగరాజుల సహకారంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. 3న ఉదయం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తామన్నారు. అలాగే 2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 500లకు పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మానం చేస్తామని చెప్పారు. సాయంత్రం బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాన్ని వెండిరథంలో ఊరేగిస్తామన్నారు. కార్యక్రమంలో పాల్గొనే వారికి భోజన వసతి కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరానున్నట్లు వెల్లడించారు.

గురువుకు సన్మానం



రిటైర్డ్ హెచ్ఎం బి.ఓబులరెడ్డి దంపతులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

తలుపుల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1963–65 సంవత్సరాల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం రిటైర్డ్ హెచ్ఎం బి.ఓబులరెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. తొలుత సరస్వతీ దేవి విగ్రహం వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రిటైర్డ్ ఆర్డీఓ సి.హరినాథరెడ్డి, రిటైర్డ్ కంటి వైద్యనిపుణులు నరసింహులు, డాక్టర్ బి. పరమేశ్వర్ రెడ్డి, వివిధ శాఖల్లో పని చేసి ఉద్యోగ విరమణ చేసిన స్టూడెంట్స్ సమావేశం నిర్వహించారు. క్రమశిక్షణతో చదువుకోవడం వల్ల ఈస్థాయికి చేరుకున్నట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు. సరస్వతీ దేవి కరుణ ఉంటే ఎంతటి స్థాయికైనా చేరుకోవచ్చని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు శ్రీరాములు, రామమోహన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, జయరామి రెడ్డి, ఓబుల్‌రెడ్డి, రమణ, టోపీ రమణ, పూర్వ విద్యార్థులు వెంకటప్ప, సూర్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

తాడిమర్రి: మండలంలోని గ్రామాల్లో సోమవారం నుంచి పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీఓ మణి మంజిరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో తాడిమర్రి, పిన్నదరి, చిల్లకొండయ్యపల్లి, దాడితోట, నిడిగల్లు, కునుకుంట్ల, ఎం అగ్రహారం, చిల్లవారిపల్లి తదితర 14 గ్రామ పంచాయతీల్లో 6,166 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నట్లు పేర్కొన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్ సొమ్ము అందజేస్తారన్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.4.25 కోట్లు విడుదల చేసిందని వెల్లడించారు.

పింఛన్ల కోసం రూ.3,26,14,000 మంజూరు

ఎన్పీకుంట: ప్రతి నెలా వృద్ధులు, దివ్యాంగులు, వితంతు, ఒంటరి మహిళలకు అందజేస్తున్న సామాజిక భద్రత పింఛన్ల సొమ్మును సోమవారం నుంచి పంపిణీ చేయనున్నట్లు ఈఓపీఆర్డీ మనోహర్ బాబు, జూనియర్ అసిస్టెంట్ సురేష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా 4,790 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా.. ప్రభుత్వం రూ.3,26,14,000 విడుదల చేసిందని పేర్కొన్నారు. ఆయా గ్రామాలకు సంబంధించిన పంచాయతీ కార్యదర్శులు ఇప్పటికే బ్యాంకుల్లో డబ్బులు డ్రా చేశారని తెలిపారు. సచివాలయ సిబ్బంది ద్వారా ఉదయం 6 గంటల నుంచే లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి పింఛన్ సొమ్ము అందిస్తారని పేర్కొన్నారు.

మండలంలో 4,330 లబ్ధిదారులు..

గాండ్లపెంట: మండల వ్యాప్తంగా సోమవారం ఉదయం 6 గంటల నుంచి సామాజిక భద్రత పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ రామానాయక్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని 7 గ్రామ సచివాలయాల పరిధిలో 4,330 మంది లబ్ధిదారులు ఉండగా.. ప్రభుత్వం రూ.2,91,14,800 విడుదల చేసిందన్నారు.

ముదిగుబ్బ: మండలంలో సోమవారం నుంచి పింఛన్ల పంపిణీ చేస్తామని ఎంపీడీఓ నాగేశాచలరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న 10,043 మంది లబ్ధిదారులకు సచివాలయ ఉద్యోగుల ద్వారా పింఛన్ సొమ్ము అందజేయడం జరుగుతుందన్నారు.

వాల్మీకి విగ్రహ ఏర్పాటుకు కృషి

పావగడ: పట్టణంలో త్వరలో వాల్మీకి విగ్రహాన్ని ప్రతిష్టాపన చేస్తామని స్థానిక వాల్మీకి సంఘం అధ్యక్షుడు, లాయర్ నరసింహ కృష్ణ తెలిపారు. అతిథి గృహంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాలూకా వ్యాప్తంగా 56 వేలకు పైగా వాల్మీకి జనాభా ఉందని, అయితే వాల్మీకుల్లో ఐక్యత కొరవడి అనేక సమస్యలు ఉత్పన్న మవుతున్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక తుమకూరు రోడ్డులో నిర్మించిన వాల్మీకి భవన్ ఎలాంటి నిర్వహణ లేకుండా పోవడంతో అభివృద్ధికి నోచుకోలేదని ఆరోపించారు. తాలూకా లోని వాల్మీకు లందరూ ఒక్క తాటి పై నడిచి వాల్మీకి సమాజం అభివృద్ధి కి కృషి చేద్దామని పిలుపు నిచ్చారు. సంఘం గౌరవ అధ్యక్షుడు నరసింహమూర్తి మాట్లాడుతూ వాల్మీకి సమాజంలో ఆర్థిక, సామాజిక, విద్య రంగాలలో వెనుక బడిన కులస్థులను ఆదుకునే దిశగా ముందుకు సాగాలన్నారు.